క్లుప్తంగా

ఏఐటీయూసీలో చేరిక



ఏఐటీయూసీలో చేరిన వారికి ఆహ్వానం పలుకుతున్న జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదుట ఆటోలు నడపుకుంటూ జీవనం సాగించే 100 మంది కార్మికులు ఐఎన్‌టీయూసీ నుంచి ఏఐటీయూసీలో చేరినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో సంఘంలో చేరిన వారికి శాలువాలు కప్పి ఆహ్వానించినట్లు చెప్పారు. నాయకులు ఈశ్వర్, చంద్రశేఖర్, వెంకటేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం ధర్నా చౌక్‌లో దీక్షా సభను ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బస్తిపాటి రామకృష్ణారెడ్డి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు బీసన్న అధ్యక్షత జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలను ఇవ్వాలన్నారు. అలాగే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, సురేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): విద్యాసంస్థల్లో విద్యార్థినులకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మహిళా విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులోని బనవాసి జూనియర్ కళాశాలలో విద్యార్థినులపై లైంగిక దాడికి ప్రయత్నించిన లైబ్రేరియన్‌ను విధుల నుంచి తప్పించాలన్నారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో పురుష ఉద్యోగులను నియమించరాదన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా సంయుక్త, కో–కన్వీనర్లుగా పావని, శ్రీవాణి, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై 11న నిరసన



డీటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈ నెల 11వ తేదీన విజయవాడలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప స్పష్టం చేశారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో జీఓ ఎంఎస్ నంబరు 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని ఉపాధ్యాయ సంఘాలను సమావేశాలకు ఆహ్వానించి, చర్చలు జరపాలన్నారు. విద్యారంగంలో అశాస్త్రీయ ధోరణులను అమలు చేయరాదన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా, డైట్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ గ్రేడ్–2 హెచ్‌ఎంలకు డిప్యూటీ డీఈఓలు పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం డీటీఎఫ్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు రోషన్న, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ బాలపీరా, సీపీఎం నాయకులు ఆదివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ కాలనీ, ఎస్సీ కాలనీలో గృహాలు శిథిలావస్థకు చేరాయని, వాటిని పునర్నిర్మించాలని కోరారు. జలజీవన్ పథకం కింద గ్రామానికి గతంలో నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదని చెప్పారు. గ్రామానికి సురక్షిత మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు, పి.బి.హుసేనయ్య, ఎస్.గోపాల్, బి.మునిస్వామి, నాయుడు, నాగరాజు తదితరులు ఉన్నారు.

కుగ్రామం నుంచి ఢిల్లీ పరేడ్‌కు..

- ఆర్‌యూ నుంచి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన మొదటి యువకుడు
- జిల్లా యువకుడి ఘనతపై హర్షం

జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన ఓ విద్యార్థి రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరగనున్న పరేడ్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటయ్యాక మొట్టమొదటిసారిగా ఓ విద్యార్థి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావడం విశేషం. ప్రస్తుతం ఢిల్లీలో ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ క్యాంప్ శిక్షణలో ఉన్న విద్యార్థి పరేడ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నాడు.



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగరాజు, పీడీ

కర్నూలు కల్చరల్: ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా నుంచి రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థి హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటయ్యాక ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్‌డీసీ పరేడ్‌కు మొదటిసారి వలంటీర్ కురుబ హర్షవర్ధన్ ఎంపిక కావడం విశేషం. ఆలూరు సమీపంలోని అరికెర గ్రామానికి చెందిన కె.నాగలక్ష్మీదేవి, పత్తికొండ మండలంలోని నలకదొడ్డి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కె.ఉలైప్ప దంపతుల కుమారుడు కురుబ హర్షవర్ధన్. ఈ యువకుడు పాఠశాల విద్యను కర్నూలు ఏపీఎస్పీ క్యాంప్‌లోని సీఆర్ఆర్ఎంఎంసీ హైస్కూల్‌లో, ఇంటర్ ఉస్మానియా కళాశాలలో చదివాడు. కర్నూలు నగరం సుంకేసుల రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుచున్నాడు. ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ పరేడ్ క్యాంప్ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహిస్తారు. ఇందులో దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల నుంచి 200 మంది వలంటీర్లు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నంచి ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు విద్యార్థినులు క్యాంప్‌లో పాల్గొంటున్నారు. అందులో ఆర్‌యూ తరఫున హర్షవర్ధన్ ప్రతినిధ్యం వహిస్తున్నాడు. ఈ వలంటీర్లు రాష్ట్రపతి, ప్రధానమంత్రితో కలిసి డిన్నర్ చేయడం, వారి సమక్షంలో ప్రదర్శన చేయనున్నారు. హర్షవర్ధన్ ఎంపిక పట్ల వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే పరేడ్‌కు హర్షవర్ధన్ ఎంపిక కావడం ఉమ్మడి జిల్లాకు గర్వకారణమని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పేర్కొన్నారు.

గర్వంగా ఉంది



ఆర్‌యూ తరఫున ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ క్యాంప్‌లో పాల్గొంటున్నందుకు గర్వంగా ఉంది. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం, వర్సిటీ అధికారుల సహాయ సహకారాలు, మార్గదర్శనంతో క్యాంప్‌నకు ఎంపిక కాగలిగాను. నెల రోజుల పాటు క్యాంప్ ఉంటుంది. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి సమక్షంలో పరేడ్‌లో పాల్గొనడం, వారి ముందు డ్యాన్స్ ప్రదర్శించడం, ప్రధాన మంత్రితో కలిపి డిన్నర్ చేయడం లాంటి గొప్ప అవకాశాలు నాకు లభించాయి. అందుకోసం ఆసక్తిగా ఎదురు చూసున్నా. క్యాంప్‌లో ప్రతి రోజు ఉదయం 6.20 నుంచి 7.30 గంటల వరకు డ్రిల్, 8.40 నుంచి 12.30 గంటల వరకు పరేడ్ మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్, మధ్యాహ్నం ఎడ్యుకేషన్ సెషన్, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు కల్చరల్ ప్రోగ్రామ్స్ ప్రాక్టీస్ ఉంటుంది. రాష్ట్రం తరఫున ఒక జానపద నృత్యం, ఒక జానపద గీతం, ఒక స్కిట్‌ను ప్రదర్శించనున్నాం.

– ఎ.కె.హర్షవర్ధన్, ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్

నేడు అర్జీల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు (టౌన్): మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఎస్‌జీఎఫ్ అండర్–17 జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలచుకొని జాతీయ పోటీలకు అర్హత సాధించాలన్నారు. ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి పరమేష్, శేఖర్ పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అవసరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక అశోక్‌నగర్ పార్కులో ఆదివారం వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు కల్లా నాగవేణి రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. వాలీబాల్‌ను సర్వీస్ కొడుతూ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడను దైనందిన జీవితంలో సాధన చేస్తుండాలన్నారు. నిర్వాహకులు కల్లా నాగవేణి రెడ్డి మాట్లాడుతూ.. వాలీబాల్ టోర్నీలో 6 జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు, కప్పులు, మెడల్స్ అందజేయనున్నట్లు చెప్పారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ తక్షణమే అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలు విడుదల చేయాలి
- బాబు.. జాబ్ క్యాలెండర్ ఎక్కడ ?
- ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్ ప్రశ్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థి సమస్యలపై ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నాం. ఎలాంటి షరతులు లేకుండా ఈ ఏడాది నుంచే తల్లికి వందనం పథకం అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను అటకెక్కించి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ఒక్క హామీని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినా ఇప్పటివరకు ‘తల్లికి వందనం’ అమలు చేయలేదని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కావొస్తున్నా ఈ పథకం అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీ ఇచ్చిన ప్రకారం జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి మొదటి వారంలోగా ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అమలు చేసిన జీఓ 85ను కొనసాగించి ఇంగ్లిష్ మీడియం విద్యను పక్కాగా అమలు చేయాలన్నారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ఇంగ్లిష్ మీడియం విద్యను దూరం చేసే కూటమి ప్రయత్నాలను తిప్పి కొడతామని స్పష్టం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు రామకృష్ణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ధోనీ బాలరాజు, నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కోట్ల మధుకుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలి





ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్ సుభద్ర మూర్తులు, ప్రవచనం చెబుతున్న రఘునందన సేవక్ ప్రభు దాస్

కర్నూలు కల్చరల్: సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. జగన్నాథ్, బలదేవ్ సుభద్ర దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రఘునందన సేవక ప్రభు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలన్నారు. దేవాలయాల ప్రతిష్ఠతను పెంచాలన్నారు. అనంతరం హరే రామ.. హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్‌యూ హాస్టల్ సామగ్రి విక్రయం ?

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టల్స్‌లోని ఇద్దరు ఉద్యోగులు అనధికారికంగా హాస్టల్‌కు సంబంధించిన వస్తువులు, ఆయిల్ డబ్బాలను విక్రయించినట్లు తెలిసింది. సుమారు 600 పైగా డబ్బాలను, పాత సామగ్రిని ఎలాంటి అనుమతులు లేకుండా చీఫ్ వార్డెన్ సెలవులో ఉన్న సమయంలో విక్రయించినట్లు సమాచారం. పది రోజుల క్రితం హాస్టల్ ఉద్యోగి, విద్యార్థి సంఘం నాయకుడి మధ్య గొడవ, తాజాగా పాత సామగ్రి విక్రయం ఘటన వెలుగులోకి రావడంతో వర్సిటీ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే వర్సిటీలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెమినార్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్

కర్నూలు(సెంట్రల్): విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే విద్యుత్ బస్సు సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి దివాకర్, రీజినల్ కార్యదర్శి వీఎస్ రాయుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 88 ద్వారా 2029 నాటికి ఆర్టీసీలో 100 శాతం విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పిందన్నారు. పీఎంఈ బస్సు సేవా పథకంలో ఏపీలోని 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీలో 2751 అద్దె బస్సులు ఉన్నాయని, వాటి స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలన్నారు. కాగా, విజయవాడలో జరిగే సెమినార్‌కు జిల్లా నుంచి కార్మికులు పెద్దఎత్తున తరలివెళ్లాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. చాలా చోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాల్లో పందులు, గాడిదలు స్వైరవిహారం చేస్తుండడంతో ఇక్కట్లు తప్పడం లేదన్నారు. మరోవైపు ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందన్నారు. అధికారులు స్పందించి శ్రీరామ్‌నగర్‌లో మౌలిక వసతులను కల్పించాలని, లేకపోతే మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేపీ జనార్దన్‌రావు, అజ్మద్, మద్దిలేటి, శ్రీనివాస యాదవ్, నరసింహ, రాజేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు



అశోక్‌నగర్‌లోని నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా నగరంలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక అశోక్ నగర్‌లోని నీటిశుద్ధి కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్ లీకేజీలకు ఆస్కారం లేకుండా సిబ్బందితో ముందస్తు తనిఖీలు నిర్వహించాలని వాటర్ వర్క్స్ డీఈఈలను ఆదేశించారు. శుద్ధికేంద్రంలోని మొక్కల నర్సరీని కమిషనర్ పరిశీలించారు. డీఈఈలు శ్రీనివాసరెడ్డి, నరేష్, ఏఈలు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందిస్తున్న కేజే రెడ్డి

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీలు గుర్తించిన క్రీడల్లో విద్యార్థినీ, విద్యార్థులు సాధన చేయాలని బిల్డర్ కేజే రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని కేజే రెడ్డి నివాస ప్రాంగణంలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. తన వంతుగా క్రీడల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడను ఉచితంగా నేర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల రక్షణ పరికరాలు హెడ్‌గార్డు, చెస్ట్ గార్డు శిక్షణలో ఇస్తామన్నారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

వడ్డె ఓబన్న జయంతి ఘనంగా నిర్వహిద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న బీసీ సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): స్వాతంత్య్ర సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలను ఈ నెల 11న ఘనంగా నిర్వహిద్దామని జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్ శశికాంత్ ప్లాజాలో వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీని నెరవేర్చాలన్నారు. ఓబన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెరులు తమ సమస్యల సాధనకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, న్యాయవాది మధుసూదన్, పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రజకుల రక్షణకు చట్టం తేవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు గడిచినా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై దాడులు జరుగుతున్నాయని, వాటి నివారణకు రక్షణ చట్టాన్ని తేవాలని ఏపీ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఐలమ్మ కార్యాలయంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, సి.గురుశేఖర్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రజక ఫెడ రేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి, తద్వారా రజకుల స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముక్కన్న, జి.రామకృష్ణ సి.హనుమంతు, లక్ష్మన్న పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం 26వ వార్డు కృష్ణానగర్‌లో కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సమితి గౌరవాధ్యక్షుడు జోగి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సప్తగిరి కాలనీలో ఉయ్యాలవాడ వారి విగ్రహం ఏర్పాటుకు పెద్ద ఎత్తున పోరాటం చేశామన్నారు. అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు మెంబర్షిప్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సమితి అధ్యక్షుడు విజయమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, గౌరవాధ్యక్షుడు కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, దండు లక్ష్మీకాంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



శిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుత కాలంలో గుండెజబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి గుండెజబ్బులు రాకుండా తగిన సూచనలు, సలహాలు అందించారు. డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మారిన జీవనశైలి, మానసిక ఒత్తిళ్లు, పరిమితిలేని ఆహారం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల గుండె జబ్బులు పెరుగుతున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో పాతికేళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ గంటపాటు వాకింగ్ చేయాలని, యోగా, ధ్యానం చేయాలని, పోషకాహారం తీసుకోవాలని, ఆహారంలో కొవ్వులు, నూనె పదార్థాలు తగ్గించాలని, దూమ, మద్యపానాలకు దూరంగా ఉండాలని సూచించారు. హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, ట్రెజరర్ కేపీ రాముడు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



శిబిరంలో చికిత్స అందిస్తున్న డాక్టర్ మీనిగ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా ప్రజలు శీతలగాలుల నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మీనిగ శ్రీనివాసులు సూచించారు. కర్నూలులోని ఎస్ఆర్ పేటలో ఉన్న తుంగభద్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని పెద్దపాడు గ్రామంలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శీతాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు, గుండెజబ్బులు, షుగర్, థైరాయిడ్, బీపీ జబ్బులున్న వారు, వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శీతల గాలుల వల్ల ఆయా జబ్బుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉదయం చలి తీవ్రత తగ్గిన తర్వాతే వాకింగ్‌కు వెళ్లాలని సూచించారు. చలిగాలులలో వాకింగ్ చేయడం ప్రమాదకరమని, ముఖ పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చర్మం పొడిబారకుండా కొబ్బరినూనె లేదా వ్యాజిలిన్ వంటివి రాసుకోవాలని సూచించారు.